ఒక్క షరతు

- అందుకు ఒప్పుకుంటేనే కాంగ్రెస్‌లోకి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి?
- సరితకు జడ్పీ చైర్‌పర్సన్ పదవి పునరుద్ధరించొద్దని కండీషన్
- బండ్ల చేరిక ఆలస్యానికి కారణం అదే
- గతంలో బీఆర్ఎస్‌లోనూ ప్రస్తుత పదవుల్లో ఉన్న ఆ ఇద్దరు
- అప్పుడు తరచూ విభేదాలు.. బహాటంగానే రెండు వర్గాల గొడవలు
- మంత్రితో తెగని చర్చలు


పార్టీ మార్పు విషయమై గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఇంటి వద్ద బీఆర్ఎస్ నాయకుల చిట్‌చాట్


కృష్ణమోహన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఆయన పార్టీ మారతారనే చర్చ కూడా జరిగింది. అలాగే పార్లమెంట్ ఎన్నికలకు ముందు కూడా ఇదే తరహా వాదన తెరపైకి వచ్చింది. కానీ ఇప్పటివరకు ఆయన చేరికపై ఎలాంటి నిర్ణయం అధికారికంగా జరగలేదు. కింది స్థాయి కార్యకర్తలతోపాటు.. ముఖ్య నాయకులు కూడా హస్తం గూటికి వెళ్లడం ఖాయమేనని కుండబద్దలు కొడుతుండగా.. ఆయన మాత్రం కాంగ్రెస్ నుంచి ఒత్తిడి ఉందని, చేరాలని కోరుతున్నారని, కానీ తాను ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని బదులిస్తున్నారు. సోమవారం కూడా ఎమ్మెల్యే ఇంటి వద్ద పలు మండలాల బీఆర్ఎస్ కార్యకర్తలు సమావేశమై చర్చించుకున్నారు. కార్యకర్తల నుంచి గ్రీన్ సిగ్నల్ ఉన్నా, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, మంత్రులు పిలుస్తున్నా.. కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడానికి ఒక్క ఇబ్బంది ఉన్నట్లు జోరుగా చర్చ సాగుతోంది. ప్రస్తుత జడ్పీచైర్‌పర్సన్ సరితకు ఆ పదవి మళ్లీ పునరిద్ధరిస్తామని చెప్పడంతో ఆయన దానికి ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అసలు ఆయన పార్టీ మార్పు ఉంటుందా?.. ఉంటే గతంలో విభేదించుకున్న ఈ ఇద్దరు మళ్లీ కలిసి ఒకే తాటిపైకి వచ్చి పని చేయగలుగుతారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎవరికి వారు పైకి ఏం చెప్పకపోయినా.. లోలోపల ప్రయత్నాలను చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సరిత కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. పార్టీ కోసం భారీగా ఖర్చు కూడా చేశారు. డీకే అరుణ బీజేపీలో చేరిన తర్వాత చుక్కాని లేని నావలా మారిన పార్టీని.. రెండో స్థానంలో నిలిపారని చెప్పొచ్చు. అలాగే బీసీ వాదం కొంత వృద్ధి చెంది.. ఆమె చుట్టూ నాయకుల పోలరైజేషన్, వర్గం తయారైంది. బీఆర్ఎస్‌లో ఉన్న పలువురు ముఖ్య నాయకులు కూడా ఆమె వర్గంలో చేరిపోయారు. అలాగే ఎన్నికల సమయంలో ఆమె వర్గంలో ఉన్న వారు తర్వాత విభేదించి.. మరో వర్గంగా తయారయ్యారు. అయితే ఇప్పుడు ఆమె వర్గాన్ని కాపాడుకోవడానికి తనకూ ఒక పదవి అవసరం ఉంటుంది. అదే సమయంలో ఆమెకు పదవి ఉంటే.. కృష్ణమోహన్‌రెడ్డి పని చేసుకోవడానికి గతంలో ఉన్న ఇబ్బందుల దృష్ట్యా వీలుపడదు. ఈ నేపథ్యంలోనే ఇంత తాత్సారం నడుస్తున్నట్లు సమాచారం.

వారు కూడానా?

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలకుగాను 12 అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది. గద్వాల జిల్లాలోని రెండు స్థానాలను బీఆర్ఎస్ తిరిగి కైవసం చేసుకుంది. ఎమ్మెల్సీగా ఉన్న చల్లా వెంకట్రామిరెడ్డి, ఆయన టికెట్ ఇప్పించుకుని గెలిపించుకున్న ఎమ్మెల్యే విజయుడిని పార్లమెంట్ ఎన్నికలకు ముందు సీఎంకు బంధువైన ఓ వ్యక్తి సంప్రదించినట్లు సమాచారం. ఎన్నికల సమయం కావడంతో ఇప్పుడు మాట్లాడటం సరికాదని చల్లా చెప్పినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందడం, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటూ గెలవకపోవడంతో చాలా మంది సీనియర్లు పార్టీని వీడేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సొంత జిల్లాలో మొత్తం ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వారే ఉండాలని సీఎం కూడా భావిస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. కృష్ణమోహన్‌రెడ్డితో చర్చలు కొలిక్కి వస్తే.. ఆ తర్వాత చల్లా, విజయుడిని పార్టీలో చేర్చుకునే ప్రయత్నం చేయనున్నారు. అయితే అక్కడ ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సంపత్‌కుమార్ ఈ చేరికకు అడ్డుపడే అవకాశం ఉంది. అలాగే కృష్ణమోహన్‌రెడ్డి చేరిక విషయంలో కూడా జడ్పీ చైర్‌పర్సన్ సరితకు సంపత్ మద్దతు ఇస్తున్నారని తెలుస్తోంది. ఎంపీ ఎన్నికల్లో డాక్టర్ మల్లు రవికి వీరు సహకరించడంతో ఆయన్ను కూడా ఈ చేరికల విషయంలో సరిత, ఆమె వర్గం నాయకులు కలిసినట్లుగా తెలుస్తోంది. మొత్తంగా ఒక్క షరతు విషయంలో క్లారిటీ వస్తే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తారా? రారా? అనే విషయం తేలనుంది.

గతంలోనూ వర్గపోరు..

గతంలో బీఆర్ఎస్‌లోనే సరిత మానవపాడు నుంచి జడ్పీటీసీగా గెలిచి, ఆ తర్వాత జడ్పీచైర్‌పర్సన్ అయ్యారు. అందుకు అప్పుడు ఎమ్మెల్యేలుగా ఉన్న డాక్టర్ వీఎం అబ్రహం, కృష్ణమోహన్‌రెడ్డి కూడా సహకరించారు. ఆ తర్వాత మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి జడ్పీచైర్‌పర్సన్ వర్గానికి ఎక్కువ ప్రోత్సాహం ఇవ్వడం, ప్రొటోకాల్ ప్రకారంగా జడ్పీ చైర్‌పర్సన్ పదవి ఎమ్మెల్యేల కంటే పెద్దది కావడం.. గతంలో గద్వాల నుంచి పోటీ చేస్తామనే ప్రకటనలతో ఇద్దరు ఎమ్మెల్యేలతో ఆమెకు విభేదాలు తలెత్తాయి. ప్రొటోకాల్ విషయంలో తరచూ గొడవలు కూడా జరిగాయి. కానీ గత బీఆర్ఎస్ అధిష్ఠానం పట్టించుకోలేదు. బీఆర్ఎస్ తరఫునే టిక్కెట్ వస్తుందని సరిత ఆశించగా కృష్ణమోహన్‌రెడ్డికే టికెట్ ఇస్తారని తెలియడంతో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. సీరియస్‌గా గ్రౌండ్ వర్క్ చేసుకోవడంతో తక్కువ తేడాతో ఓటమి చెందారు. ఒక దశలో సరిత గెలుస్తుందనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఇప్పుడు కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్తే.. సరిత వర్గానికి పెద్ద ఎదురుదెబ్బగానే పరిగణించవచ్చు. ఎన్నికల సమయంలో వెంట ఉన్న బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి వర్గీయులు ఇప్పటికే సరితతో విభేదించి.. తరచూ గొడవల మధ్య పార్టీ కార్యక్రమాలు చేసుకుంటున్నారు. ఇప్పుడు కృష్ణమోహన్‌రెడ్డి వస్తే ఇంకా ఇబ్బంది పెరిగే అవకాశం కచ్చితంగా ఉంటుంది. అయితే జడ్పీచైర్‌పర్సన్ పదవి మళ్లీ పునరుద్ధరిస్తే సరిత వర్గానికి నష్టం ఉండదు. కానీ పార్టీలో మాత్రం రెండు వర్గాలు సాధారణం కానున్నాయి. జడ్పీ చైర్‌పర్సన్ పదవి సరితకు మళ్లీ ఇస్తే.. కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉండదు. గతంలో ఆమె పార్టీ మారిన తర్వాత కృష్ణమోహన్‌రెడ్డి వర్గం స్వేచ్ఛగా భావించింది. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన సరిత తనకు ఆ పదవిని పునరుద్ధరించాలని కోరినట్లు తెలుస్తుండగా.. కృష్ణమోహన్‌రెడ్డి చేరికపై ఎలాంటి నిర్ణయం జరగలేదని ఆయన బదులిచినట్లు సమాచారం. అయితే చేరిక అంశంపై ఇప్పటివరకు మంత్రి స్థాయిలోనే చర్చలు జరుగుతున్నట్లు దీన్నిబట్టి అర్థమవుతోంది.


మహబూబ్‌నగర్‌లోని వానగుట్ట ఈద్గా వద్ద ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

భక్తిశ్రద్ధలతో.. బక్రీద్

- జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు

ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 17: బక్రీద్(ఈద్ ఉల్ జుహా)పండుగను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, మండలాలు, గ్రామాల్లోని ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని వానగుట్ట రహెమానియా ఈద్గాలో వేలాది మంది ముస్లింలు నమాజ్ చేశారు. జామియా మసీదు ఇమామ్ మౌలానా హఫీజ్ ఇస్మాయిల్ ఉదయం 8:30 గంటలకు ప్రార్థనలు చేయించారు. పండుగ ప్రాశస్త్యాన్ని వివరించారు. ప్రవక్త ఆచరించిన ధర్మ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఖ్వామీ ఏక్తా కమిటీ తరఫున ఈద్గా ఆవరణలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.


ప్రార్థన చేస్తున్న చిన్నారులు

పెళ్లి చేసుకొని మోసం

- ఇన్‌స్టాగ్రామ్‌లో తిరుపతి యువతితో పరిచయం
- ఏడాది తర్వాత పెళ్లి.. రెండు నెలల కాపురం
- అనంతరం పరారైన యువకుడు



గద్వాల క్రైం, జూన్ 17: తిరుపతికి చెందిన యువతితో జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడుకు చెందిన యువకుడికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఏడాది తర్వాత వివాహం చేసుకున్నారు. తీరా రెండు నెలలు కాపురం చేశాక ఆ యువకుడు తన ఇంట్లో వారికి ఆరోగ్యం సరిగాలేదని వచ్చి, ఊర్లోనే ఉండిపోవడంతో సదరు యువతి పోలీసులను ఆశ్రయించింది. చివరకు ఎస్ఐ కూడా యువకుడి తరఫున వకాల్తా పుచ్చుకుంటున్నారని ఆమె డీఎస్పీ సత్యనారాయణకు సోమవారం ఫిర్యాదు చేసుకుంది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న ఘటన వివరాలు బాధిత యువతి, పోలీసుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా వాకాడుకోట మండలం, విద్యానగర్‌కు చెందిన నిహారిక అనే యువతికి జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం ఏ బూర్దిపాడు గ్రామానికి చెందిన బషీర్ అనే యువకుడితో ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి కొద్దిరోజులు ఇద్దరూ సహజీవనం చేశారు. అయితే తనకు ఇంతకుముందే వివాహమై విడాకులు కూడా అయ్యాయని, తనకు ఇద్దరు సంతానం అని చెప్పినా కూడా బషీర్ తనకు ఎలాంటి ఇబ్బంది లేదన్నాడని నిహారిక తెలిపింది. అయితే ఈ ఏడాది మార్చి 18న ఆయన హిందూ సాంప్రదాయం ప్రకారం తాళి కట్టాడన్నారు. తర్వాత కొద్దిరోజుల ఇద్దరూ తిరుపతిలోని విద్యానగర్‌లో కాపురం ఉన్నామన్నారు. ఇలా రెండు నెలలు తమ కాపురం సాఫీగా జరిగిన తర్వాత తన తల్లికి ఆరోగ్యం బాగోలేదని అన్న మౌలాలీ ఫోన్ చేశాడని, వెళ్లి చూసి వస్తానని అక్కడి నుంచి బషీర్ ఇక్కడికి వచ్చాడని ఆమె చెప్పారు. తర్వాత తాను ఎన్నిసార్లు ఫోన్ చేసినా అందుబాటులోకి రాకపోవడంతో చివరకు తానే తన భర్త ఊరికి వచ్చి గత నెల 25న శాంతినగర్‌కు వచ్చి పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా ఎస్ఐ సంతోష్ తనను అసభ్యకరంగా, అవమానకరంగా, ఉద్దేశపూర్వకంగా మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు స్టేషన్‌లోనే ఉంచాడని చెప్పారు. తన భర్తను, వారి కుటుంబ సభ్యులు ఇంట్లోనే దాచి నీవే ఏమో చేశావ్ అంటూ తనపై నిందలు వేసి భయభ్రాంతులకు గురిచేసినట్లు ఆరోపించారు. దీంతో పాటు ఎస్ఐ సంతోష్ తన కుటుంబ సభ్యులకు తన వ్యక్తిగత విషయాలు చెబుతూ తన క్యారెక్టర్ బాగోలేదని చెప్పి వారిని ఆందోళనకు గురిచేసినట్లు వివరించారు. మళ్లీ సోమవారం బక్రీద్ పండుగ కనుక తన భర్త ఇంటికి వస్తాడని భావించి బూడిదపాడు గ్రామానికి వచ్చానని, దీంతో తన భర్త తనను అసభ్యకరంగా దూషిస్తూ ఇంట్లోకి రానివ్వకుండా దాడిచేశాడన్నారు. విషయాన్ని ఎస్ఐకి వివరించగా వారితో ముందుగానే డబ్బులు తీసుకొని వారికే వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. ఎస్ఐ సంతోష్‌పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డీఎస్పీ సత్యనారాయణకు నిహారిక సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై శాంతినగర్ ఎస్ఐ సంతోష్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా నిహారిక ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేననీ, కేసు వద్దంటుందన్నారు. ఇరువురిని కూర్చోబెట్టి రాజీ చేయాలని, పరిహారం ఇప్పించేలా చూడాలని చెబుతుందన్నారు. అది తమ డ్యూటీ కాదని పోలీస్ స్టేషన్ బయట మీరే చూసుకోవాలని చెప్పినట్లు చెప్పారు.


జానకి ధరావత్

కొత్త ఎస్పీల నియామకం

- మహబూబ్‌నగర్‌కు జానకి ధరావత్..
- గద్వాలకు టి.శ్రీనివాసరావు
- హర్షవర్ధన్, రితిరాజ్ బదిలీ

మహబూబ్‌నగర్/గద్వాల క్రైమ్, జూన్17: రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ఐఏఎస్‌లను బదిలీ చేయగా, సోమవారం ఐపీఎస్‌లను బదిలీ చేసింది. అందులో భాగంగానే మహబూబ్‌నగర్, గద్వాల ఎస్పీలు హర్షవర్ధన్, రితిరాజ్ బదిలీ కాగా, వారి స్థానంలో మహబూబ్‌నగర్ ఎస్పీగా జానకి ధరావత్, జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీగా టి.శ్రీనివాసరావులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జానకి సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా పని చేస్తుండగా, టి.శ్రీనివాసరావు సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా పని చేస్తున్నారు. కాగా.. మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్‌ను హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోగా, రితిరాజ్‌ను ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా నియమించారు.

2007లో డీఎస్పీగా ఎంపిక

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం రోళ్లబండ తండాకు చెందిన జానకి ధరావత్ 2007లో గ్రూప్ 1లో డీఎస్పీగా ఎంపికయ్యారు. రాజమండ్రి, సిరిసిల్ల, గుంటూరులో డీఎస్పీగా పనిచేశారు. ప్రొబెషనరీ సమయంలో మహబూబ్‌నగర్‌లోనూ పని చేశారు. 2013లో ఐపీఎస్‌గా సెలెక్ట్ అయ్యి.. హైదరాబాద్ ఇంటెలిజెన్స్ ఎస్పీగా, మల్కాజిగిరి డీసీపీగా పని చేశారు.


శ్రీనివాసరావు

భౌ బోయ్



- పాలమూరు పట్టణంలో కుక్కల బెడద
- ఎక్కడ చూసినా వాటి గుంపులే
- పది రోజుల క్రితం ఒకే కుక్క పది మందికి కాటు
- కుక్కలను తగ్గించేందుకు మళ్లీ జనన నియంత్రణ ఆపరేషన్లు
- ఒక్కోదానికి రూ.1,450 ఖర్చు
- ఇప్పటి వరకు రూ.65 లక్షలు వ్యయం


జనన నియంత్రణ ఆపరేషన్ చేసేందుకు మహబూబ్‌నగర్‌లోని కేంద్రానికి తెచ్చిన కుక్కలు

మహబూబ్‌నగర్, జూన్ 17: పాలమూరులో ప్రస్తుతం కుక్కల బెడద ప్రధాన సమస్యగా మారింది. ఎక్కడ చూసినా శునకాలు గుంపులుగా తిరుగుతూ, ప్రజలను కరుస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పురపాలిక కౌన్సిల్ సమావేశం జరిగితే ఆరేడు మంది సభ్యులు తమ వార్డుల్లో కుక్కల సమస్య తీవ్రంగా ఉందని, వాటిని నియంత్రించాలని మొరపెట్టుకుంటున్నారు. పది రోజుల క్రితం పట్టణంలోని పోలీస్‌లైన్, మోనప్పగుట్ట ప్రాంతంలో ఒకే కుక్క పది మందిని కాటువేసింది. ఎదురొచ్చిన వారినల్లా కరువడంతో జనం పరుగులు తీయాల్సి వచ్చింది. దీనిపై పుర అధికారులు సీరియస్‌గా స్పందించారు. కుక్కలను పట్టి, మళ్లీ వాటికి జనన నియంత్రణ ఆపరేషన్ చేసే పనిలో పడ్డారు. ఇదివరకు కుక్కల బెడద పెరిగినపుడల్లా వాటిని సంహరించేందుకు ఆహారంలో మత్తు కలుపడం, లేదంటే వాటిని పట్టి దూరంగా వదిలిపెట్టేవాళ్లు. అయితే జంతు ప్రేమికుల నుంచి విమర్శలు రావడంతో ఇప్పుడు కుక్కలను సంహరించకుండా, వాటి సంతతిని తగ్గించేందుకు జనన నియంత్రణ ఆపరేషన్ చేస్తున్నారు. అందులో భాగంగా పాలమూరు పురపాలికలోని మౌలాలి గుట్టలో రూ.50 లక్షలు వెచ్చించి జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జంతు జనన నియంత్రణ కేంద్రం

ఒక్కో కుక్కకు రూ.1,450 ఖర్చు

కుక్కల సంతతిని నియంత్రించే పనిని హైదరాబాద్‌కు చెందిన స్వతంత్ర అనిమల్ కేర్ సంస్థకు అప్పగించారు. వారు పట్టణంలోని కుక్కలను పట్టుకుని, మౌలాలి గుట్టకు తరలిస్తారు. అక్కడి వైద్యుడితో జనన నియంత్రణ ఆపరేషన్ చేశాక, రెండ్రోజులు కుక్కలను వారి సంరక్షణలోనే ఉంచుకుంటారు. ఆ తరువాత వదిలేస్తారు. ఇలా చేయడానికి ఒక్కో కుక్కకు పురపాలిక రూ.1,450 చెల్లిస్తోంది. ఇప్పటివరకు పట్టణంలోని 4,500 కుక్కల వరకు ఆపరేషన్లు చేశారు. వీటికి గాను దాదాపు రూ.65 లక్షల వరకు ఖర్చు అయింది. అయితే ఆపరేషన్ అనంతరం కుక్కలు బాగా నీరసంగా మారుతున్నట్లు తెలుస్తోంది. ఆడ, మగ రెండింటికీ ఆపరేషన్ చేస్తున్నారు. కొత్త సంతతి రాకుండా తగ్గించడంతోపాటు కొన్నాళ్లకు ప్రస్తుతం ఉన్న కుక్కలు కూడా తగ్గిపోయేలా చేయడమే ఈ ఆపరేషన్ల ప్రధాన లక్ష్యం. అయితే ఇంకా చాలా ఏరియాల్లో కుక్కలు సమూహంగా తిరగడం వల్ల జనాలు భయపడుతున్నారు. వల వేసి, కుక్కలను పడుతూ ఆపరేషన్ చేసేందుకు తరలిస్తుండటంతో కుక్కలు కూడా తమ మనుగడను చాటుకోవాలని ఇలా గుంపులుగా తిరుగుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఎక్కడ చూసినా పదుల సంఖ్యలో కుక్కలు కనిపించేసరికి ప్రజల్లో అవి విపరీతంగా పెరిగాయన్న అభిప్రాయం నెలకొంది. ఇదివరకులా కుక్కలన్నింటినీ పట్టణం నుంచి తరలించాలని డిమాండ్ వస్తోంది.


కుక్కలను పట్టి వాహనంలోకి ఎక్కిస్తున్న యానిమల్ కేర్ సంస్థ సిబ్బంది

వివాహిత ఆత్మహత్య

భూత్పూర్, జూన్ 17 : ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూత్పూర్ మునిసిపాలిటీకి చెందిన సరిగిరి వెంకటేష్ ఎల్ఈడీ బల్బుల వ్యాపారం చేస్తూ భార్య లక్ష్మి(36)తో కలిసి పట్టణంలో నివాసముంటున్నాడు. ఈనెల 15వ తేదీన భార్య లక్ష్మి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కోసం భర్త వెతికాడు. ఆచూకీ లేకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో సోమవారం మునిసిపాలిటీ పరిధిలోని కతికేవాని వాగులో ఓ చెట్టుకు ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై శ్రీనివాసులు ఉరి వేసుకున్న మహిళ లక్ష్మిగా గుర్తించి, దర్యాప్తు చేపట్టారు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మదనపల్లిలో స్థల వివాదం

- ఇరు వర్గాల మధ్య ఘర్షణ



కాంపౌండ్ వాల్ బండలను ధ్వంసం చేసిన దృశ్యం

గద్వాల, జూన్ 17 : మండల పరిధిలోని మదనపల్లిలో స్థల వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని సర్వే నెంబర్ 115లో ప్రభుత్వం భూమిని సేకరించి 1984లో 10 మంది దాసరి కులస్థులకు ప్లాట్లు పంపిణీ చేసింది.

అందులో ఏడు ప్లాట్లలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. మరో మూడు ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఆ భూమి ధరణి పోర్టల్‌లో అప్పటి యజమానిపేరుపైనే ఉండటంతో, గ్రామానికి చెందిన మాజీ సర్పంచు బంధువు కన్నేశాడు. ఖాళీగా ఉన్న స్థలాన్ని మూడు నెలల క్రితం తహసీల్దార్ కార్యాలంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అయితే అప్పటికే ఆ స్థలంలో లబ్ధిదారులు బండలతో ప్రహరీ నిర్మించుకున్నారు. ఈ విషయంపై సోమవారం ఇరువర్గాల మధ్య వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తి తన అనుచరులతో బండలను తొలగించారు. ఈ విషయంపై బాధితులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని బాధితులు శ్రీను, గుండన్న, అంజనేయులు, లక్ష్మన్న రెవెన్యూ, పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

- ఆరువేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు, జూన్ 17 : ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలకళ సంతరించుకుంటోంది. ప్రస్తుతం జలాశయంలో 318.180 మీటర్ల మేర, 8.869 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సోమవారం 6,691 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా నమోదయ్యింది. ప్రాజెక్టు నుంచి నెట్టెంపాడు లిఫ్ట్‌కు 875 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 650, కోయిల్‌సాగర్ లిఫ్ట్‌కు 315, సమాంతర కాల్వకు 800, భీమా లిఫ్ట్-2కు 583, మొత్తంగా జలాశయం నుంచి 2,779 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సుంకేసులకు 4,200 క్యూసెక్కులు

రాజోలి: రాష్ట్రం సరిహద్దులో, రాజోలి మండల శివారులోని సుంకేసుల జలాశయానికి సోమవారం ఎగువ నుంచి 4,200 క్యూసెక్కుల వరద నీరు విడుదలైనట్లు జేఈ రాజు తెలిపారు. జలాశయంలోని ఒకటవ గేట్‌ను మీటరు మేర ఎత్తి 3,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. జలాశయంలో గరిష్ఠ స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.110 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు. గరిష్ఠ నీటిమట్టం 292 మీటర్లకు గాను, ప్రస్తుతం 291.70 మీటర్ల మేర నీరు చేరినట్లు తెలిపారు.



జూరాలకు వచ్చి చేరిన వరద నీరు

కాలువలు ఇలా... నీరు పారేదెలా

- ఎంజీకేఎల్ఐ కాల్వలో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు
- పొలాలకు పారని సాగునీరు
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

పెద్దకొత్తపల్లి, జూన్ 17 : మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం ద్వారా రైతాంగానికి సాగునీరందించేందు కోసం తవ్విన కాల్వలో జమ్ము, గడ్డి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పొలాలకు నీరు పారలేని పరిస్థితి ఏర్పడింది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్, జొన్నలబొగుడ, సాతాపూర్, కొత్తపేట, నారాయణపల్లి, చెన్నపురాంపల్లి, కల్వకోల్ తదితర గ్రామాల సమీపంలో ఉన్న ఎంజీఎల్ఐ కాల్వలో పిచ్చి మొక్కలు, జమ్ము ఏపుగా పెరిగింది.

ప్రస్తుత ఖరీఫ్‌కు కాల్వల ద్వారా రైతుల పంట పొలాలకు సక్రమంగా నీరు అందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలో జమ్ము, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నదని రైతులు పేర్కొన్నారు. కాల్వలో ఏపుగా పెరిగి పిచ్చిమొక్కలు, జమ్ము గడ్డిని తొలగించాలని ఎన్నోమార్లు ప్రజాప్రతినిధులకు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయక ముందే కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, జమ్మును తొలగించి నీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



సాతాపూర్ శివారులో కేఎల్ఐ కాల్వలో ఏపుగా పెరిగిన జమ్ము



పెద్దకొత్తపల్లి, దేవునితిర్మలాపూర్ గ్రామాల మధ్య కాల్వలో అడ్డంగా ఉన్న రాళ్లు, చెత్త

● పంట కాల్వలను శుభ్రపర్చాలి



కేఎల్ఐ పంట కాల్వలో విపరీతంగా పెరిగిన జమ్ము, పిచ్చిమొక్కలను తొలగించాలి. కాల్వలో అడ్డంగా జమ్ము పెరగడం వలన నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతున్నది. జమ్మును తొలగించి కాల్వలను శుభ్రపర్చాలి.

- బొల్లె పెద్దనిరంజన్, రైతు, దేవునితిర్మలాపూర్

● పిచ్చి మొక్కలు, జమ్మును తొలగించాలి



సాతాపూర్, కొత్తపేట, జొన్నలబొగుడ, దేవునితిర్మలాపూర్ గ్రామాల శివారులో కేఎల్ఐ కాల్వలో ఏపుగా జమ్ము, పిచ్చి మొక్కలు మొలకెత్తాయి. జమ్మును పిచ్చి మొక్కలను తొలగించి నీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలి.

- తిరుమల్‌యాదవ్, రైతు, సాతాపూర్

పేకాటలో ఎవరి వాటా ఎంత?

- పోలీసుల పాత్రలో నిజమెంత..?
- పేకాటలో ఆస్తులు పోగొట్టుకొని రోడ్డుపాలు
- పేకాట రాయుళ్ల వీక్‌నెస్ సొమ్ము చేసుకుంటున్న నిర్వాహకులు
- పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను శిక్షించాలంటూ డిమాండ్

బిజినేపల్లి, జూన్ 17 : అక్రమాలను, జూదరుల ఆగడాలను అరికట్టాల్సిన పోలీసులే మామూళ్ల మత్తులో పేకాట రాయుళ్లకు బాసటగా నిలిచారని వస్తున్న ఆరోపణల్లో నిజమెంత నిగ్గు తేల్చడంతో పాటు ఏవరి వాటా ఎంత? బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. దుండగులు మరోసారి పేకాట, జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పేకాట వ్యసనానికి బానిలైన ఎందరో ఆస్తులు పోగొట్టుకొని రోడ్డు పాలు కావడంతో పాటు భార్యా పిల్లలకు, కుటుంబాలకు దూరమై ఎవరికీ చెప్పుకోలేక నరకం అనుభవిస్తున్నారు. మరికొందరు రూ.లక్షల్లో అప్పు చేసి పేకాటలో పోగొట్టుకొని అప్పులు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు సైతం ఉన్నాయి. పేకాటకు అలవాటు పడిన వారి వీక్‌నెస్‌ను కొందరు క్యాష్ చేసుకోవడానికి వారికి అవసరమైన వసతులు కల్పిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. శిబిరాల నిర్వాహకులను పట్టుకొని శిక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.



బిజినేపల్లి పోలీస్‌స్టేషన్ భవనం

బిజినేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో కొందరు రోజుకో గ్రామంలో పేకాట స్థావరం ఏర్పాటు చేసుకొని కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, మహబూబ్ నగర్, అచ్చంపేట తదితర ప్రాంతాల్లోని పేకాట రాయులను కూడగట్టుకొని ఒక షోకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తూ వారికి అవసరమైన ప్లేయింగ్ కార్డ్స్, ఆహారం, సిగరేట్లు, మందు వంటివి సమకూర్చడంతో పాటు ఇటుపక్క పోలీసులు రాకుండా నిర్వాహకులు మామూళ్లు ఇచ్చి మేనేజ్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని పాలెం, మంగనూర్ గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు కలిసి రోజుకో గ్రామంలో ఎవరికీ అనుమానం రాకుండా పేకాట స్థావరాలను ఏర్పాటు చేస్తూ యధేచ్చగా సాగిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చాయి. కేవలం బిజినేపల్లి మండలంలోనే కాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల వ్యక్తులతో కలిసి పేకాట స్థావరాలను ఏర్పాటు చేసుకొని పేకాట దందాను మూడు పువ్వులు, ఆరు కాయలు అనే చందంగా సాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఈనెల 15న వట్టెం శివారులో పేకాట స్థావరంపై విశ్వసనీయ సమాచారం మేరకు డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్ సిబ్బందితో కలిసి దాడి చేసి 16 మంది పేకాట రాయులను, రూ.1,59,680 నగదు, రెండు కార్లు, 6 బైక్‌లు, 14 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దాడికి వెళ్లిన పోలీసులు అక్కడ ఊహించిన దాని కన్నా ఎక్కువ మంది పేకాట రాయులు ఉండడం గమనార్హం. దాదాపు 30 మందికి పైగా పేకాట రాయుళ్లు ఉండటంతో 15 మంది పోలీసు సిబ్బందితో వెళ్లిన డీఎస్పీ చాలా మందిని పట్టుకోలేకపోయారు. దొరికిన వారిని విచారించి మిగతా వారిని అదుపులోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. పేకాట స్థావరాల నిర్వహణపై నేరుగా పోలీసులే మామూళ్లు తీసుకొని గుట్టుచప్పుడు కాకుండా ఉంటున్నారని ఆరోపణలు రావడంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి సంబంధిత పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకుండా రాత్రి సమయాల్లో పెట్రోలింగ్, పగటి వేళల్లో అనుమానం ఉన్న వ్యక్తులపై, అనుమానిత ప్రాంతాలపై నిఘా పెంచాలని పలువురు కోరుతున్నారు.

రోటవేటర్ దొంగతనం

వడ్డేపల్లి, జూన్ 17 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని తుమ్మిళ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ అనే రైతుకు సంబంధించి ట్రాక్టర్ రోటవేటర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రైతు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సంతోష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిని ప్రైవేటు ఉద్యోగులు

అలంపూర్ చౌరస్తా, జూన్ 17 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులో జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. జాతీయ రహదారి సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పెబ్బేరు మండల పరిధిలోని ఓ లిక్కర్ కంపనీలో పని చేసే ఉద్యోగులు సోమవారం కారు (స్కార్పియో)లో కర్నూలు వైపు వెళ్తూ, పుల్లూరు శివారులోని రిలియన్స్ పెట్రోలు బంకు ఎదురుగా, ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొన్నారు. దీంతో కారు టైరు విరిగి వాహనం బోల్తా పడింది. దీంతో స్కార్పియోలో ప్రయాణిస్తున్న దీపక్ కుమార్‌గుప్త, ఉసేనయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్ శివ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ పైలట్ ప్రభాకర్, ఈఎంటీ శేఖర్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి, మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

ఉప్పునుంతల , జూన్ 17: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై అయ్యవారిపల్లి గేటు వద్ద ఆదివారం కారు బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డికి చెందిన వెంకటయ్య, విష్ణువర్దన్, ప్రవీణ్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కలిసి శ్రీశైలం దైవదర్శనానికి కారులో వెళ్లారు.

తిరుగు ప్రయాణంలో సంగారెడ్డి వైపు వెళుతున్న వీరి వాహనం అయ్యవారిపల్లి గేటు వద్ద ఆకస్మికంగా అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వెంకటయ్య, విష్ణువర్దన్, ప్రవీణ్ తలకు గాయాలవ్వగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో అచ్చంపేట సివిల్ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు.

కనుల పండువగా స్వామి వారి కల్యాణం

- భక్త లక్ష్మీనరసింహస్వామి కల్యాణ వైభోగం

కందనూలు, జూన్ 17 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద గల శ్రీభక్తలక్ష్మీ నరసింహస్వామి వారి 6వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకం, పూర్ణమంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలతో మూడవ రోజు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపక ధర్మకర్త కాశింశెట్టి విజయలక్ష్మీ స్వామి వారి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. భక్తమహాత్యము స్వామివారిని అనుసరించిన వారికి కలిగే మంచి వివరించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

స్వామివారి కల్యాణ వైభోగాన్ని వందలాదిగా భక్తులు తరలివచ్చి కల్యాణ మూర్తులను దర్శించుకున్నారు.

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలతో పాటు తీర్థప్రసాద వితరణ చేశారు.



స్వామి వారి కల్యాణానికి హాజరైన భక్తులు



శ్రీభక్తలక్ష్మీనరసింహస్వామి వారి ఉత్సవ మూర్తులు

ఐక్యంగా పోరాడినప్పుడే హక్కులు సాధించగలం

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

వనపర్తి టౌన్, జూన్ 17: కార్మికవర్గం ఐక్యంగా పోరాడినప్పుడే మన హక్కులు సాధించుకోగలమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పీ జయలక్ష్మి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాల్లో సీఐటీయూ శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ గత ఎన్నికల్లో 303 సీట్లు సాధించిందని, ఈ సారి కేవలం 240 సీట్లు మాత్రమే వచ్చాయని, 63సీట్లను కోల్పోయిందన్నారు. దీంతో ఎన్‌డీఏ భాగస్వామి పక్షాలపై ఆధారపడాల్సిన ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలన్నారు. మతం వ్యక్తిగతమని, భారతదేశం భిన్నత్వంలో ఏకత్వంగా జీవిస్తున్న అనేక మతాలకు ఈ దేశం నిలయమన్నారు. కానీ బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ హిందూ, ముస్లింల పేరుతో ప్రజలను, కార్మికులను విడదీయాలనే ప్రయత్నం చేస్తుందన్నారు. దేశంలోని లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడారు.నాయకులు బొబ్బిలి నిక్సాన్, ఆర్ఎన్ రమేష్, మదన్, బుచ్చమ్మ, శారద, జ్యోతి, నారాయణమ్మ, భాగ్యమ్మ, శివమ్మ, సునిత, బాబు సాగర్, కావలి ఆంజనేయులు, రంగస్వామి, మద్దిలేటి పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల ముగింపు సభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

అనుమానాస్పదంగా మట్టి కుప్పలు

- వాటిలో మృతదేహాలు ఉన్నాయంటూ ప్రచారం
- పరిశీలించిన పోలీసులు, రెవెన్యూ అధికారులు
- నేడు వాటిని తవ్వి పరిశీలించాలని నిర్ణయం

ధరూరు, జూన్ 17 : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలోని మన్నాపురం రోడ్డు చివరనున్న ఓ పొలంలో సమాధితులను పోలిన రెండు మట్టి కుప్పలు కన్పించడంతో స్థానికంగా కలకలం చెలరేగింది. సోమవారం రైతు హనుమంతు పొలంలో సమాధిని పోలిన ఎనిమిది ఫీట్ల పొడవు, నాలుగు ఫీట్ల వెడల్పు ఉన్న రెండు మట్టి కుప్పలు కన్పించాయి. ఎవరినో హత్య చేసి అక్కడ పూడ్చి పెట్టినట్లుగా వదంతులు వ్యాపించాయి. దీంతో పరిసర ప్రాంతాలకు చెందిన జనం అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.

ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందింది. దీంతో ధరూరు ఎస్ఐ విజయ్‌కుమార్, తహసీల్దార్ వెంకట్రావు, గ్రామ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మట్టికుప్పలు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించామని చెప్పారు. మంగళవారం వాటిని తవ్వి పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ధరూరు ఎస్ఐ విజయ్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, అన్ని విషయాలను లోతుగా విచారణ చేస్తున్నామని చెప్పారు. సంఘటన స్థలం వద్ద నలుగురు కానిస్టేబుళ్లతో కాపలా ఏర్పటు చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం మట్టికుప్పలను తవ్వి పరిశీలించనున్నట్లు చెప్పారు. అప్పటివరకు ప్రజలు సంయమనం పాటించాలని సూచించారు.



ధరూరులోని ఓ వ్యవసాయ పొలంలో ఉన్న మట్టి కుప్పలు

డీసీఎం, ద్విచక్ర వాహనం ఢీ: యువకునికి తీవ్ర గాయాలు

కల్వకుర్తిటౌన్, జూన్ 17 : పట్టణ సమీపంలో పత్తిమిల్లు వద్ద డీసీఎం, ద్విచక్ర వాహనం ఢీకొని యువకునికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... కల్వకుర్తి పట్టణానికి చెందిన తరుణ్ ద్విచక్ర వాహనంపై మార్చాల గ్రామం వైపు వెళుతున్నాడని, ఇదే సమయంలో పట్టణం నుంచి జడ్చర్ల వైపు వెళుతున్న డీసీఎం వాహనం పత్తి మిల్లు వద్ద వెనకనుంచి ఢీకొన్నది. ఈ సంఘటనలో యువకుని తలకు తీవ్ర గాయమైందని, ఆ యువకున్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

లారీ ఢీకొని...



గాయపడిన సత్యనారాయణ

లారీ, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. సంఘటనా స్థలం వద్ద తెలిపిన వారి వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి ద్విచవాహనంపై కల్వకుర్తి పట్టణం నుంచి జడ్చర్ల వైపు వెళుతూ ఎదురుగా వచ్చిన లారీని ఢీకొని గాయాలైనట్లు వారు తెలిపారు. గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారు వివరించారు. గాయపడిన వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్లు, ఆయన వద్ద లభించిన వివరాల ప్రకారం ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు వారుపేర్కొన్నారు.

బైక్‌పై నుంచి కిందపడి యువకుడి మృతి

అచ్చంపేటటౌన్, జూన్ 17: అచ్చంపేట మండల పరిధిలోని లింగోటం గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కన గుంతలో బైకుపై నుంచి పడి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని గుట్టమీదతండా గ్రామానికి చెందిన సభావత్ గణేష్(30)తండ్రి హన్మంతు అచ్చంపేటలో కూరగాయల వ్యాపారం చేసేవారు. ఆదివారం రాత్రి పని ముగించుకొని తన సొంత గ్రామానికి వెళుతుండగా ప్రమాదవశాత్తు అచ్చంపేట మండల పరిధిలోని లింగోటం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన గుంతలో బైక్‌పైనుంచి పడి ఉండటంతో.. అటుగా వస్తున్న దేవదారుకుంట గ్రామానికి చెందిన ఇస్లావత్ దేవేందర్ గమనించి 100 ద్వారా పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు అక్కడకు చేరుకోగా, అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఆసుపత్రిలో మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పరామర్శించారు. మృతుని భార్య సభావత్ పూజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై-2 శివయ్య తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

వలస కూలీ మృతి

కోడేరు, జూన్ 17 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిధిలోని రాగూర్‌తండాకు చెందిన సేవ్యానాయక్(55) అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొన్ని రోజుల కిందట బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి వలస కూలీగా జీవిస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి చెందిన వార్త తెలిసి రాగూర్‌తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

శివాలయం ఆవరణలో చోరీకి యత్నం

- వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

మహమ్మదాబాద్, జూన్ 17 : దేవాలయంలో దొంగతనానికి యత్నించిన వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని వెంకట్‌రెడ్డిపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని శివాలయంలో సోమవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన అరవ వెంకటయ్య అనే వ్యక్తి శివాలయం గర్భగుడి బయట ఉన్న కొన్ని వస్తువులను చోరీ చేసేందుకు యత్నిస్తుండగా గమనించిన గ్రామస్థులు పట్టుకొని తమకు అప్పగించారన్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు వెంకటయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

వడ్డేపల్లి, జూన్ 17 : జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కలుకుంట్ల అడవి ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి ఆలయంలో దొంగలు చొరబడ్డారు. ఆంజనేయ స్వామి ఆలయంలో రూ. 10 వేలు, పక్కనే ఉన్న సీతారాముల వారి ఆలయంలో పుస్తెల బొట్టు, మెట్లను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు అర్చకుడు మద్దిలేటి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సంతోష్ చెప్పారు.

విద్యుత్ వైర్ దొంగతనం

- చోరీ ఘటనపై స్పందించని విద్యుత్ అధికారులు
- విచారణ చేపట్టాలని గ్రామస్థుల డిమాండ్

మహమ్మదాబాద్, జూన్ 17 : మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం గాదిర్యాల్ గ్రామంలో గల మెగాపార్క్‌లో విద్యుత్ వైరు అపహరణకు గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గాదిర్యాల్ గ్రామంలోని కొనేంగల గుట్ట వద్దగల తూర్పు బాలయ్య వ్యవసాయ పొలం సమీపంలో ఉన్న ట్రాన్స్‌పార్మర్ నుంచి అటవీ ప్రాంతం సమీపం వరకు తొమ్మిది స్తంభాలకు ఉన్న వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గ్రామస్థులు తెలిపారు. సుమారు తొమ్మిది పొలాలకు ఉన్న వైరు, మెగాపార్కులో బోరు మోటారుకు బిగించిన పైపులు, స్టార్టర్, పైపులైన్ పైపులు దొంగిలించబడ్డాయన్నారు. వీటి విలువ సుమారు రూ.మూడు లక్షల వరకు ఉంటుందని వారు పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలను కూడా దుండగులు పెకిలించే ప్రయత్నం చేసినట్లు వారు తెలిపారు. ఘటనపై విద్యుత్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

బొలెరో బోల్తా : తప్పిన ప్రమాదం



బోల్తా పడ్డ బొలెరో వాహనం

మక్తల్, జూన్ 17 : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఓ బొలెరో వాహనం బోల్తా పడింది. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాయచూరు నుంచి వస్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి రహదారి పక్కకు దూసుకుపోయి బోల్తా పడింది. ఈ సంఘటనలో వాహనం పల్టీ కొట్టగా, వాహనంలో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఇసుక డంపుల సీజ్

అమరచింత,జూన్ 17: అమరచింత శివారులోని ఇసుక డంపులను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పజెప్పినట్లు ఎస్ఐ సురేష్ పేర్కొన్నారు. సోమవారం అపరిచిత వ్యక్తుల సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పట్టణ శివారులో వెళ్లి పరిశీలించగా అక్కడ ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేశామన్నారు. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

చిన్నచింతకుంట, జూన్ 17 : కుక్కల దాడిలో 35 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం పర్దీపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలో పూజరి శ్రీశైలం, పూజరి చెవిటి మల్లప్ప, బాల చంద్రప్పలకు చెందిన 35 గొర్రె పిల్లలపై గ్రామంలోని కుక్కలు దాడి చేసి చంపివేశాయి. గొర్రెపిల్లల మృతితో దాదాపు రూ.ఐదు లక్షల మేర నష్టం జరిగిందని బాధితులు వాపోయారు.

మందుగుండు సామగ్రి చోరీ - కేసు నమోదు

వెల్దండ, జూన్ 17 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సమీపంలోని వెంకటేశ్వర స్టోన్ క్రషర్‌లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బ్లాస్టింగ్‌కు ఉపయోగించే సుమారు రెండు లక్షల విలువైన మందుగుండు సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లినట్లు సూపర్‌వైజర్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

» మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 17 : విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గంజి లింగన్న టవర్స్‌లో ముదిరాజ్ జిల్లా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో మంచి జీపీఏ సాధించిన విద్యార్థులకు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు, ప్రముఖ న్యాయవాది ఎన్‌పీ.వెంకటేష్, ప్రముఖ వైద్యులు శ్రీనివాసరాజు, సంఘం నాయకులు మైత్రి యాదయ్య, మెట్టుకాడి శ్యామ్, గంజి ఆంజనేయులు, సత్యనారాయణ, విజయ్‌కుమార్, గోవిందు, డా.మడుగు విజయ్‌కుమార్, జే.మధు తదితరులున్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి కృషి

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 17 : అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 17వ వార్డు దొడ్డలోనిపల్లిలో గల ముస్లిం శ్మశాన వాటిక రహదారి ఏర్పాటు కోసం సోమవారం క్యాంపు కార్యాలయంలో వార్డు ప్రతినిధులకు రూ.రెండు లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అశ్వక్, హకీం, నాసర్‌మౌలానా, బిలాల్, జహంగీర్, ఖాదర్, నిరంజన్, ముతార్, మస్యూద్, ఫరీద్ తదితరులున్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

మహబూబ్‌నగర్, జూన్ 17 : పట్టణంలోని మౌలాలిగుట్ట వద్దనున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీని సోమవారం కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించి వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ జీప్లస్2 పద్ధతిలో 28 బ్లాకులలో 672 ఇళ్లను గృహ నిర్మాణశాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టింది. ఫ్లోర్‌కు ఎనిమిది ఇళ్ల చొప్పున ఒక బ్లాక్‌లో 24 గృహాలు నిర్మించారు. మొదటి దశలో 588, రెండో దశలో 84 ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని హౌసింగ్ ఈఈ వైద్యం భాస్కర్ కలెక్టర్‌కు వివరించారు. 672 గృహాల్లో ఇప్పటివరకు 588 గృహాలు లబ్ధిదారులకు కేటాయింపులు చేశారని, వాటిని హ్యాండోవర్ చేయాల్సి ఉందని తెలిపారు. మౌలిక వసతుల కల్పన కోసం రూ.7.85 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఆయన పేర్కొన్నారు. ఇందులో విద్యుత్ సరఫరాకు పోల్స్, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రూ.69.30 లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.4.86 కోట్లు, రూ.1.76 కోట్లు డ్రైనేజీ నిర్మాణాలు, రూ.53.69 లక్షలతో అంతర్గత రహదారుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామని ఈఈ కలెక్టర్‌కు వివరించారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులు రాణించాలి

» ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్



ఫుట్‌బాల్ క్రీడాకారులను సన్మానించిన వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 17 : ఫుట్‌బాల్‌లో జిల్లా క్రీడాకారులు రాణించాలని ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ.వెంకటేశ్ అన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో డీలైసెన్స్ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన మీర్‌వాజీద్‌అలీ, చంద్రశేఖర్, అలాగే పోర్చుగల్ దేశంలోని స్పోర్టింగ్ లిస్బన్ ఫుట్‌బాల్ క్లబ్‌లో పాల్గొనేందుకు వెళుతున్న మహ్మద్ ఖాజామొయినుద్దీన్ సోమవారం జిల్లా కేంద్రంలో క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్‌పీ.వెంకటేశ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. ఫుట్‌బాల్‌లో జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి చేరుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో సంఘం సెక్రటరీ భానుకిరణ్, సభ్యులు నగేష్, నందకిశోర్, ఇమాన్యుయేల్, జేమ్స్, రామకృష్ణ, శివశంకర్, మహ్మద్ హబీబుద్దీన్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



గాయత్రి మాత జయంతి కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి, పురోహిత సంఘం సభ్యులు

జడ్చర్ల, జూన్ 17 : ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని, భక్తి మార్గంతోనే ప్రశాంతత దొరుకుతుందని బ్రాహణ సేవా సమితి అధ్యక్షుడు చల్లా నరేంద్రశర్మ అన్నారు. సోమవారం గాయత్రి మాత జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని బ్రాహణ సేవా సమితి ఆధ్వర్యంలో సహస్రనామ జపం, పూజలు, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ చల్లా సుమన్‌శర్మ, ప్రధాన కార్యదర్శి రామవేంద్రశర్మ, కార్యవర్గ సభ్యులు, పురోహిత సంఘం సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం ఝాన్సీలక్ష్మీబాయి

జడ్చర్ల, జూన్ 17 : పట్టణంలోని అనురా గిణి ఆశ్రమంలో సోమవారం సంస్కార భారతి ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జగ్‌పాల్‌రెడ్డి ఝాన్సీలక్ష్మీబాయి జీవిత చరిత్రను వివరించారు. దేశ నాయకుల చరిత్రను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు భువనేశ్వరి, సంస్కార భారతి సభ్యుడు రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బాలానగర్, జూన్ 17 : మండల కేంద్రంలో 1988-89 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులు అందరూ ఒకచోట కలుసుకొని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. మరోసారి ఇలాంటి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుందామని పూర్వ విద్యార్థులందరూ నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ వివద్యార్థులు పరమేశ్వర్, రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య, రమేష్, అంజి, లక్ష్మణ్, ఎండీ.గౌస్, సత్యనారాయణ తదితరులున్నారు.

పండుగలు ఐక్యతకు ప్రతీకలు

» మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
» జిల్లాలో ఘనంగా బక్రీద్
» ఈద్గాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



మహబూబ్‌నగర్‌లోని ఈద్గా వద్ద ఒబేదుల్లాకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే, ఎన్‌పీ వెంకటేశ్



మిడ్జిల్‌లోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 17 : పండుగలు ఐక్యతకు ప్రతీకలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రహెమానియా ఈద్గాలో ఎమ్మెల్యే యెన్నంతో పాటు, పలువురు ప్రజా ప్రతినిధులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భారత దేశంలో కులమతాలకతీతంగా హిందూ, ముస్లింలు పండుగలు జరుపుకుంటారన్నారు. మహబూబ్‌నగర్ ప్రేమ ఆప్యాయతలకు నిలయమని, ఇక్కడ అందరు కలిసి ఉండాలన్నారు. మాజీ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత మత సామరస్యానికి ప్రతీకగా తెలంగాణ నిలిచిందన్నారు. హిందూ ముస్లింలందరూ గంగా, జమున తహజీబ్‌లా జీవనం సాగిస్తున్నారని గుర్తుచేశారు. ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ భారతదేశం హిందూ, ముస్లిం ఐక్యతకు ప్రతీక అని, ఇక్కడ అందరు కలిసి మెలిసి ఉంటారన్నారు. ఒకరి పండుగ ఒకరు జరుపుకొని మన ఐక్యతను చాటాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, మాజీ మునిసిపల్ చైర్మన్ కేసీ.నర్సింహులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్‌రహెమాన్, నాయకులు మన్నె జీవన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, ఎన్‌పీ.వెంకటేశ్, మక్సూద్, చంద్రకుమార్‌గౌడ్, బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్, రాజేందర్‌రెడ్డి, మోసిన్‌ఖాన్, ఫారుక్‌హుస్సేన్, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

● మిడ్జిల్ : మండల కేంద్రంతో పాటు, పరిధిలోని గ్రామాల్లో బక్రీద్‌ను పురస్కరించుకొని ఈద్గాల్లో సోమవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మజీద్ నుంచి ర్యాలీగా వెళ్లి ఈద్గా వద్ద ఈదుల్‌అదా నమాజ్‌ను చేపట్టారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలను తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గౌస్, హిమామ్‌ఇర్ఫాన్, మౌజాన్ మహబూబ్, అధ్యక్షుడు జహంగీర్, ఉపాధ్యక్షుడు సిద్దిక్, సిరాజ్, మహబూబ్, ప్రధాన కార్యదర్శి నిస్సార్, సభ్యులు నబ్బీ, నిరంజన్, హకీంపాషా, ఖాజా, మతిన్, అలీ, రహీం, సయ్యద్, జహంగీర్ తదితరులున్నారు.

● హన్వాడ : మండల కేంద్రంతో పాటు, గ్రామాల్లో ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ పార్టీల నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

● జడ్చర్ల : జడ్చర్ల నియోజకవర్గంలో ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మునిసిపల్ పరిధిలోని పాతబజారు, జడ్చర్లలోని ఇండస్ట్రీయల్ ఏరియాలోని వివిధ గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

● భూత్పూర్ : బక్రీద్ సందర్భంగా స్థానిక ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, నాయకులు మురళీధర్‌గౌడ్, నారాయణగౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, యువత విభాగం నాయకులు గడ్డం ప్రేమ్‌కుమార్ తదితరులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో మైనార్టీ నాయకుడు ఫారుక్ ఇంటి వద్ద ఏర్పాటుచేసిన బక్రీద్ పండుగ విందుకు బీజేపీ పార్లమెంటు నాయకుడు డోకూరు పవన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. మద్దిగట్ల గ్రామ మజీద్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి తదితరులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

● గండీడ్ : బక్రీద్ సందర్భంగా మండల పరిధిలోని గ్రామాల్లో ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. తహసీల్దార్ నాగలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వెన్నాచేడ్ మాజీ సర్పంచు పుల్లారెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

● నవాబ్‌పేట/బాలానగర్/మహమ్మదాబాద్/రాజాపూర్, కోయిలకొండ : మండల కేంద్రాలతో పాటు, గ్రామాల్లో బక్రీద్ సందర్భంగా ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలు పార్టీల నాయకులు ఈద్గాల వద్ద ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



మహబూబ్‌నగర్‌లోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపేందుకు మహబూబ్‌నగర్‌లోని ఈద్గా వద్దకు వచ్చిన ప్రజాప్రతినిధులు

మారుమూల గ్రామాలకూ బస్సు సౌకర్యం

» పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి
» కొత్లాబాద్ బస్సు పునఃప్రారంభం
» చెలిమిల్ల వద్ద బస్సును స్వాగతించిన మండల నాయకులు, ప్రజలు



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

గండీడ్, జూన్ 17 : మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పరిగి డిపోలో పరిగి నుంచి వయా చెలిమిల్ల, రంగారెడ్డిపల్లి, పగిడ్యాల్ మీదుగా కొత్లాబాద్ వరకు వెళ్లే బస్సును ఆయన ప్రారంభించారు. నాలుగేళ్ల నుంచి పైగ్రామాలకు బస్సును నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు బస్సు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 'బస్సు సౌకర్యం కల్పించరా' శీర్షికన గతనెల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైనట్లు ఆయా గ్రామాల నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం బస్సును పునః ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. బస్సు రాకతో జిన్నారం, కొత్లాబాద్ గ్రామాల ప్రజలకు, విద్యార్థులకు రవాణా కష్టాలు తీరుతాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ మారుమూల గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తుందని అన్నారు. కాగా, చెలిమిల్ల, పగిడ్యాల్ గ్రామం వద్ద బస్సుకు ఆయా గ్రామాల ప్రజలు స్వాగతం పలికారు. పీసీసీ సభ్యుడు నరసింహరావు, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, బి.గోపాల్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆశిరెడ్డి, బాలస్వామి, వెంకట్‌యాదవ్, విజయ్‌కుమార్, పరిగి డీఎం పవిత్ర, ఆర్టీసీ సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 17 : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని డీఈవో ఏ.రవీందర్ హెచ్చరించారు. టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించడం, స్పౌజ్ విభాగంలో తప్పుడు సమాచారం ఇవ్వడం, దివ్యాంగుల విభాగంలో, మెడికల్ గ్రౌండ్స్, వితంతు విభాగంలో లబ్ధి పొందేందుకు అక్రమాలు చేసినట్లయితే అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పదోన్నతులు పొందే టీచర్లు ఇప్పటికే రెండుసార్లు పదోన్నతులు నిరాకరించి మళ్లీ ఇప్పుడు పదోన్నతులు తీసుకోవడానికి సిద్ధమైతే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోయిలకొండ, జూన్ 17 : మండలంలోని చన్‌మన్‌పల్లితండాలో సోమవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. లింగంపల్లి రోడ్డు నుంచి చన్‌మన్‌పల్లి వరకు గాను సీసీ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకుడు రవినాయక్ తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యశాఖ అన్ని కేటగిరీల్లో బదిలీలు చేపట్టాలి

» టీజీఎంఈయూ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూన్ 17 : రాష్ట్రంలోని ఆరోగ్యశాఖలో గల అన్ని కేటగిరీలకు బదిలీలు చేపట్టాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ పదవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జనరల్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని, పీఆర్సీ, పదోన్నతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఆసుపత్రి బ్రాంచి అధ్యక్షుడు కోటేశ్వర్‌రెడ్డి, నాయకుడు రాంప్రసాద్, మెడికల్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురేష్ తదితరులున్నారు.

ప్రకటించిన మేరకు వేతనాలు ఇవ్వాలి

» టీఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి యాదగిరి

చిన్నచింతకుంట, జూన్ 17 : కొన్నిరోజుల క్రితం బీడీ యాజమాన్యం కార్మిక సంఘాల ప్రతినిధులతో చేపట్టిన చర్చల్లో ఒప్పందం మేరకు వెయ్యి బీడీలకు రూ.235 ఇవ్వాలని కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పీఎఫ్‌తో కలుపుకొని రూ.235 ఇవ్వాల్సి ఉండగా కొన్ని కారణాలతో రూ.230 చెల్లిస్తున్నట్లు కార్మికులు యూనియన్ దృష్టికి తీసుకువచ్చారని, ఇలా చేయడం సరి కాదని యాదగిరి పేర్కొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

» ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య



మాట్లాడుతున్న జంబులయ్య

హన్వాడ, జూన్ 17 : ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హన్వాడలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాల పిల్లలకు విద్య అందడం లేదన్నారు. గత ప్రభుత్వాలు కేజీ టు పీజీ విద్యను అందిస్తామని చెప్పి అందించలేదని ఆరోపించారు. ఈ ప్రభుత్వమైనా విద్యా హక్కు చట్టాన్ని అమలు చేసి పేదలకు విద్యను అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1200 పాఠశాలలు మూతపడ్డాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో నిరుపేదలకు 25 శాతం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్య విధాన చట్టంతో నష్టం జరుగుతోందన్నారు. దీనిపై ఈనెల 19న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి విద్యావంతులు, మేధావులు, పెద్ద సంఖ్యలో రావాలని కోరారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యాదయ్య, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు గంగయ్య, కృష్ణ, కిరణ్, యాదయ్య, వెంకటేష్, రాజు, రాము తదితరులున్నారు.

తక్షణమే బీసీ కులగణన చేపట్టాలి

» బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పాలమూరు, జూన్ 17 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లుగా తక్షణమే బీసీ కులగణన చేపట్టాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించిందన్నారు. నేడు ఓటర్ల జాబితా ఆధారంగా సర్వే చేసి రిజర్వేషన్లు అమలు చేస్తామనటం విడ్డూరంగా ఉందన్నారు. సమయంలేని కులగణన చేయడానికి ఎక్కువ సమయం పడుతుందని, ఎన్నికలు ఆలస్యమవుతుందనే సాకుతో ఆలాంటి ఆలోచన చేయటం సరికాదన్నారు. ఎక్కడ ఏ కులం వారు ఎక్కువ ఉంటే తమ పదవి ఎక్కడ పోతుందోనని భయపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బీసీల వ్యతిరేకిగా ముద్రపడటమే కాక స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల పాత్ర ఏంటో చూపెట్టి తగిన గుణపాఠం చెప్పేందుకు బీసీ సమాజం చూస్తోందన్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగం లక్ష్మీకాంత్, జాంగ్ర నాయకుడు మహేంద్రదర్, కుమ్మరి సంఘం బుగ్గన్న, నాయీ బ్రాహ్మణ నాయకులు డీకే.కృష్ణయ్య, సవారి సత్యం, బిశేఖర్, జంగం విశ్వనాథ్ ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన

జడ్చర్ల, జూన్ 17 : జడ్చర్ల పోలీస్‌స్టేషన్ ముందు ఓ వర్గానికి చెందిన దాదాపు రెండు వందల మంది ప్రజలు సోమవారం ఆందోళనకు దిగారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులను, పశువులను వధిస్తున్నారనే విషయంపై జడ్చర్ల పరిసర ప్రాంతాల్లో ఓ పార్టీ నాయకులు ఆరా తీశారు. ఓ ప్రాంతంలో నాలుగు పశువులు ఆ పార్టీ నాయకులకు కనిపించడంతో ఫొటోలు, వీడియోలు తీసి సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేయడంతో పాటు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అక్కడున్న పశువులను గోశాలకు తరలించారు. అయితే ఆ పార్టీ నాయకులు తమను అభాసుపాలు చేసేందుకే ప్రయత్నించారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ జడ్చర్ల పోలీస్‌స్టేషన్ ముందు ఓ వర్గం వారు ఆందోళనకు దిగారు. ఆందోళనకారులను సీఐ ఆదిరెడ్డి, ఎస్సైలు చంద్రమోహన్, శివానంద్, అశోక్‌బాబు సముదాయించి పంపించివేశారు. శాంతిభద్రతలను ఏఎస్పీ రాములు, మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లుతో పాటు పోలీసు అధికారులు పర్యవేక్షించారు.

రచ్చకెక్కిన కొత్తగంజి భూ పంచాయితీ

మహబూబ్‌నగర్, జూన్ 17 : పట్టణంలోని కొత్తగంజి ప్రాంతంలో నిర్మిస్తున్న బహుళ అంతస్తు స్థలం వివాదాస్పదంగా మారింది. ఈ స్థలాన్ని తాము కొనుగోలు చేసి అందరం కలిసి అపార్ట్‌మెంట్ నిర్మించుకుంటున్నామని ఓ వర్గం చెబుతుండగా, అసలు ఈ స్థలం తాము ఎవరికీ విక్రయించలేదని.. 50 ఏళ్లుగా ఈ స్థలంపై పంచాయితీ కొనసాగుతోందని మరో వర్గం చెబుతుండటం విశేషం. కొత్తగంజిలోని సర్వే నెంబర్ 1037, 1040లో కౌకుంట్ల ఫ్యామిలీ బహుళ అంతస్తు నిర్మాణం చేపడుతోంది. ఇప్పటికే నాలుగు అంతస్తులు పూర్తిచేసి ఐదో అంతస్తు నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ స్థలం తమదేనని జాన్‌శ్యాముల్‌మనోహర్ కుటుంబం వాదిస్తోంది. 1974లోనే తమకు ఈ స్థలంపై డిగ్రీ ఉందని.. అమ్మ వారసత్వంగా తనకు వచ్చిందని.. ఈ 11.44 ఎకరాల స్థలాన్ని మాజీ మునిసిపల్ చైర్మన్, కల్వకుంట్ల కుటుంబాలు కలిసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని శ్యాముల్‌మనోహర్ తన అడ్వకేట్ సునీల్‌తో కలిసి సోమవారం మీడియాతో మాట్లాడారు. ఇక్కడ నిర్మాణం చేస్తున్నారని.. తాము ఇదివరకే మునిసిపల్ కమిషనర్, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కౌకుంట్ల కుటుంబాలకు చెందిన చంద్రమోహన్ మాత్రం 2001లో తాము ఈ స్థలాన్ని మాజీ మునిసిపల్ చైర్మన్ చేత కొనుగోలు చేశామని, పక్కాగా డాక్యుమెంట్లు ఉన్నాయని, అన్ని అనుమతులు తీసుకున్నాకే భవనం నిర్మిస్తున్నామన్నారు. దీనిపై ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి వరకు వెళతామని వారు స్పష్టం చేశారు.